కళ తప్పిన సంజీవయ్య పార్కు

- కరువైన పచ్చదనం - ఎండిపోయిన మొక్కలు - మూతపడిన మ్యూజికల్ ఫౌంటేన్

బేగంపేట్ డిసెంబర్ 1: నెక్లెస్‌రోడ్డులోని సంజీవయ్య పార్కు నిర్వహణ పూర్తిగా ఆధ్వాన్నంగా మారింది. పార్కులో కనిపించాల్సిన పచ్చిక బయళ్లకు బదులు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పిచ్చి మొక్కలతో నిండి నిరుపయోగంగా తలపిస్తోంది. పార్కులో పచ్చదనం కరువై ఎడారిలా మారింది. ఇక్కడికి ప్రతినిత్యం కొన్ని వందల మంది ఉదయం పూట వాకింగ్‌తోపాటు సందర్శకులు వస్తుంటారు. ఈ పార్కులో రోజ్, బటర్‌ఫ్లై, బాంబు గార్డెన్స్ ఉన్నాయి. ఇవన్నీ కూడా నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయాయి. సంబంధిత అధికారులు పార్కును చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని సందర్శకులు కోరుతున్నారు. పార్కులో హంగు ఆర్భాటాలతో ప్రారంభించిన మ్యూజికల్ ఫౌంటేన్ మూతపడింది. ప్రారంభించిన మరుసటి రోజు నుంచే మూసివేశారు. తర్వాత అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. సందర్శకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

సంజీవయ్య పార్కులో పూర్తిగా ఎండిపోయిన మొక్కలు

టాసా జీఓసీగా అజయ్ మిశ్రా బాధ్యతల స్వీకరణ

బొల్లారం, డిసెంబర్ 1: సికింద్రాబాద్ తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా (టాసా) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ)గా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1992లో రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీలో నియమితుడయ్యారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఖడక్వాస్లా, ఇండియన్ మిలటరీ అకాడమీ, లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్(ఎల్ఏసీ)రెజిమెంట్, బ్రిగేడియర్‌గా నాయకత్వం వహించారు. అనంతరం మేజర్ జనరల్ అజయ్ మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా సంసిద్ధతను పెంచడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న 'పెయింటింగ్స్'

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పరిచయ్ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాటర్ కలర్ క్యాంపు నిర్వహించారు. 18 మంది కళాకారులు పాల్గొని 30 వాటర్ కలర్ పెయింటింగ్స్ వేశారు. సంజయ్ అష్టపుత్ర, డాక్టర్ నీరజ్ రాజ్, జయ్వంత్ నాయుడులతో ప్రత్యేక ఆర్ట్ టాక్‌లను నిర్వహించారు.
– కొండాపూర్, డిసెంబర్ 1

అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైంది

పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబర్ 1: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముడిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి గురుస్వామి, ఉప్పల శ్రీనివాస్ గురుస్వామి, నర్సింగ్ గురుస్వామి పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

నూతన మోటర్‌ను బిగిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్, డిసెంబర్ 1: తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్టు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రెండో వార్డు అన్నానగర్ మైసమ్మ ఆలయం వద్ద పవర్ బోర్‌వెల్‌కు బోర్డు అధికారులు కొత్త మోటార్‌ను ఇచ్చారు. దీంతో స్థానిక నేతలతో కలిసి ఆయన బిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన మోటార్ బిగించడంతో ప్రజల నీటి అవసరాలు తీర్చామని తెలిపారు. ఆదేవిధంగా రెండో వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్టు చెప్పారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ రెండో వార్డు అధ్యక్షుడు కుమార్‌ముదిరాజ్, నేతలు శ్యామ్‌రెడ్డి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

చిక్కడపల్లి, డిసెంబర్ 1: రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంక్షేమ సమితి 5వ వార్షికోత్సవ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న ఒక్కో రైతు కుటుంబానికి రూ.10వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు న్యాయమైన ధర దొరకడం లేదని తెలిపారు. రైతులందరికీ రైతు బీమా కల్పించాలని, అతివృష్టి అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని అన్నారు. సమావేశంలో శాస్త్రవేత్త బాబు రావు, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, సోగరాబేగం, ఏలేశ్వరం వెకంటేశ్, న్యాయవాది లక్ష్మినారాయణ, ప్రొఫెసర్ వెంకట రాజయ్య, ఎంఏ అజీజ్, గోవర్ధన్ , నర్సింహ, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అభివాదం చేస్తున్న ఎత్తిరి మారయ్య, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ మౌర్య తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 1: అత్యంత వెనబడి ఉన్న బీసీ–ఏలో ఉన్న వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డ ఓబన్న తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి మారయ్య అన్నారు. సంఘం ఆధ్వర్యంలో చైతన్య సమావేశం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. భారతీయ వడ్డెర సమాజ సేవ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వడ్డెరలు సంఘటితంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ మౌర్య మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆధునిక భారత దేశ నిర్మాణంలో వడ్డెరలు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని అన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సంపంగి ప్రభాకర్, యువజన విభాగం అధ్యక్షుడు కె.శేఖర్, మహిళా అధ్యక్షురాలు రూప, శివరాత్రి వెంకటేశ్, సంఘం కర్ణాటక అధ్యక్షుడు జగన్నాథ్, సమయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు బాలమల్లేశ్‌కు నివాళి

జగద్గిరిగుట్ట: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ పోరాటం మరువలేనిదని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆయన మృతికి సంతాపంగా ఆదివారం జగద్గిరిగుట్టలో చిత్రపటానికి పూల నివాళులర్పించారు. ఉమామహేశ్, ఏసురత్నం, హరినాథ్, స్వామి, హైమవతి, రాములు రవి, ఇమామ్ పాల్గొన్నారు.

అన్నదానం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, తదితరులు

సికింద్రాబాద్, డిసెంబర్ 1: కార్తీక మాసం అమావాస్య ను పురస్కరించుకొని సికింద్రాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బౌద్ధనగర్ గాంధీ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి కుమార్, చంద్రశేఖర్, ప్రభాకర్, వెంకటేశ్వర్, చందా, భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూబోయిన్‌పల్లి పరిధిలో..

బొల్లారం: న్యూబోయిన్‌పల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం కార్తీక మాసం అమవాస్యను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అజిత్ కళ్యాణ్, పుట్ట నర్సింహ, రామారావు, జహీంగీర్‌గౌడ్, టీఎన్ శ్రీనివాస్, టింకుగౌడ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసిపడిన మంటలు

మంటలను అర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అడ్డగుట్ట, డిసెంబర్ 1: తుకారాం గేట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారి మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన ప్రజలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలను త్వరగా అర్పివేయడంతో స్థానిక నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

పోలీస్ కిష్టయ్యకు నివాళి

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 1 : తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని ఆదివారం సుచిత్ర చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి మధుసూదన్‌రాజ్, నాగేశ్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, స్వామిముదిరాజ్, శివకుమార్, సాయిలు, మహిళలు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు తరలిన నేతలు

అడ్డగుట్ట నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి వెళ్తుతున్న మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు

గాంధీనగర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు మధుసూదన్, తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 1: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన మాలల సింహగర్జన సభకు అడ్డగుట్ట డివిజన్ నుంచి నక్క మధు ఆధ్వర్యంలో మాల మహానాడు నేతలు, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో బయల్దేరి వెళ్లారు. తుకారాంగేట్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మాలలందరిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వారి హక్కుల సాధనకు, రిజర్వేషన్ ఫలాలు ప్రతి మాల కుటుంబానికి అందే విధంగా రానున్నకాలంలో ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. సభకు తరలివెళ్లిన వారిలో ఆర్.మల్లేశ్, మహేందర్, ప్రసాద్, కుమారి, నాగేశ్, ప్రకాశ్, అమర్, శారద, నర్సింగ్‌తో పాటు సుమారు 500 మంది తరలివెళ్లారు.


మాలల సింహగర్జన సభకు హాజరైన మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

సింహగర్జనకు పెద్దఎత్తున తరలిన మాలలు

చిక్కడపల్లి: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జనకు గాంధీనగర్ యువజన సంఘం బస్తీ, మాలబస్తీ నుంచి పెద్ద ఎత్తున తరలివెల్లారు. నాయకుల జీఎస్ మధుసూదన్, జి.వెంకటేశ్, ఎం.సునీల్, మదన్మోహన్, జగదీశ్, శ్రీనివాస్, నాగరాజు, జెం.రాంబాబు, పి.మల్లేశ్, కె.ముకేశ్ పాల్గొన్నారు.

అడ్డగుట్ట: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన మాలల సింహగర్జన సభకు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఆధ్వర్యంలో నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో బయల్దేరి వెళ్లారు. మెట్టుగూడ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి ర్యాలీగా తరలి వెళ్లారు.

సభకు తరలివెళ్లిన కంటోన్మెంట్ నేతలు

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన మాలల సింహగర్జనకు కంటోన్మెంట్ నుంచి పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలివెళ్లారు. యూనిటీ ఆఫ్ కంటోన్మెంట్ మాల ఆధ్వర్యంలో పికెట్ చౌరస్తాలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు నాయకులు సంకి రవీందర్, సుస్మిత పూలమాలు వేసి నివాలర్పించారు. అనంతరం పరేడ్ మైదానం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కేడీ రమేశ్, మాజీ బోర్డు సభ్యురాలు నళిని, నాయకులు భాగ్యమ్మ, సాయికుమార్, సతీశ్‌కుమార్, ఉదయ్‌కుమార్, నర్సింగ్‌రావు, పెంటా శ్రీహరి, యాదగిరి, రావుల సతీశ్, మహేందర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానం

బీదల బస్తీ రేణుక ఎల్లమ్మ కల్యాణానికి రావాలని ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సికింద్రాబాద్, డిసెంబర్ 1: ఈనెల 4న బీదలబస్తీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే అమ్మవారి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని నాయకులు నాగులూరి సాయిబాబాకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందించారు. ఆలయ కమిటీ సభ్యుల బృందం ఆదివారం చిలకలగూడలోని సాయిబాబా నివాసానికి నాయకుల బృందం తరలివెళ్లి ఆహ్వానపత్రికను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్. సీతారాం, ప్రధాన కార్యదర్శి వీజే శేషగిరిరావు, సలహాదారులు జీఎం మల్లేశ్, రాజమౌళి, లక్ష్మణ్, గంగపుత్ర సంఘం నాయకుడు చల్లూరి సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

శేరిలింగంపల్లి: ఉరేసు కొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ హబీబ్‌ఉల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీ సీ బ్లాకులో సుధీర్, శోభిత దంపతులు నివాసం ఉంటున్నారు. ఐటీ కారిడార్‌లోని ఓ కంపెనీలో సుధీర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా శోభిత గృహిణి. కాగా ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శోభిత బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థలానికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా శోభిత మృతికి కారణాలు తెలియరాలేదని ఇన్‌స్పెక్టర్ హబీబ్‌ఉల్లాఖాన్ తెలిపారు.

దానశీలి అరిగపూడి విజయ్‌కుమార్

విజయ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళా జనార్దన్ మూర్తి, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 1: నిస్వార్థ దాన గుణం కలిగిన అరిగపూడి విజయ్‌కుమార్ దానశీలి అని ప్రముఖ సాహితీవేత్తలు అన్నారు. ఇటీవల మృతిచెందిన ఆయనకు సంతాపం ప్రకటిస్తూ త్యాగారాయ గానసభలో అధ్యక్షుడు కళా జనార్దన్ మూర్తి అధ్యక్షతన సభను నిర్వహించారు. పలువురు పాల్గొని ఆయనతో తమ అనుబంధం గుర్తుచేసుకున్నారు. మూర్తి మాట్లాడుతూ గానసభ ఆడిటోరియంలో తైల వర్ణ చిత్రాల కోసం విజయ్ కుమార్ ఆర్థిక సాయం చేశారని చెప్పారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ విజయకుమార్ కళా హృదయుడు సంగీత ప్రియుడు, సాంస్కృతిక సంస్థలకు సన్నిహితుడని అన్నారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్ అధినేతన కిన్నెర రఘురాం, గాయకులు వైఎస్ రామకృష్ణ, త్రినాథరావు, వసుందర, నటులు రోసిరెడ్డి, జంగయ్యగౌడ్, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు లోకం కృష్ణయ్య, ఓంకార్ రాజు, వంశీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మహిళకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

అడ్డగుట్ట, డిసెంబర్ 1: మెట్టుగూడ దూద్‌బావి ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి, మా ఈఎన్‌టీ వైద్యులు పాల్గొని ఉచితంగా కంటి, చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. శిబిరంలో సుమారు 300 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ బాలకోటి రెడ్డి, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి మధుకర్, డాక్టర్ అక్షిత్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి, బస్తీవాసులు మల్లేశ్, నర్సింహ, కుమార్, సోమయ్య పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

శాంతారావు దంపతులను సన్మానిస్తున్న మెట్రో జోన్ సీజీఎం చక్రపాణి

చిక్కడపల్లి, డిసెంబర్ 1: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాత్ర ఎంతో ఉందని టీజీఎస్‌పీడీసీఎల్ మెట్రో జోన్ సీజీఎం చక్రపాణి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముషీరాబాద్ ఏఈ బి.శాంతారావు పదవీ విరమణ ఆత్మీయ వీడుకోలు సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీజీఎం చక్రపాణి మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు సంస్థలో, ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సంస్థలో 36 ఏండ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ చేసిన శాంతారావు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంస్థ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న మాట్లాడుతూ పూరిగుడిసె నుంచి భవనాల వరకు అందరి ఇండ్లలో వెలుగును నింపె సంస్థ విద్యుత్ సంస్థ అని అన్నారు. అనంతరం శాంతారావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అజామాబాద్ డీఈ కమాల్‌కుమార్, ఏడీలు వినోద్‌కుమార్, శ్రీనివాస్, శీనయ్య, 1104 విద్యుత్ ఉద్యోగుల యూనియన్ పి.ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి డీఎం ప్రభాకర్, రిజినల్ ప్రెసిడెంట్ జంజిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్'

కొండాపూర్, డిసెంబర్ 1 : అబద్దాలు చెప్పి ఆడబిడ్డలను మోసగించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని ఆదివారం ఆయన కొండాపూర్‌లోని జిల్లా దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఆడ బిడ్డలను అబద్ధపు హామీలతో నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. తర్వాత ప్రభుత్వ దవాఖానలో ప్రసవానికి వచ్చే వారికి కేసీఆర్ కిట్‌లు, ప్రభుత్వం ఇచ్చే నగదును ఎగ్గొట్టిందన్నారు. ఆడబిడ్డలు నమ్మి మోసపోయారని అన్నారు. ఎన్నికలెప్పుడొచ్చినా గెలుపు బీఆర్ఎస్‌దే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.